స్కెచ్

# వాడిన పువ్వు

"మాధవరెడ్డి"

సెలవుల్లో మధ్యాహ్నం-బద్ధకంగా నిద్రలేచాను. పొద్దుపోక నిద్రాదేవిని రోజూ ఆహ్వానిస్తున్నాను. నన్ను రోజూ తన కోమలమైన మెత్తని వొడిలోకి సుస్వాగతమిస్తూ ఆహ్వానిస్తుందా దేవి. నిజంగా ఆమెకెంతగానో ఋణపడ్డాను. అసలు మానవుడు తన జీవిత వ్యవధిలో సగం పైగా ఆ దేవి సాన్నిధ్యంలో మైమరుస్తాడు - స్వప్నాలు కంటూ హాయిని పొందుతాడు.

ఏమీతోచక అలా బయలు దేరాను వొంటరిగా. సాయంకాలం కావస్తోంది. అప్పుడప్పుడే సాయంకాలపు పిల్లగాలులు వస్తున్నట్లున్నాయి. ప్రకృతి అంతా వడగాడ్పులో శోషవచ్చి నాలుక ఎండి-మళ్ళీ ఈ తుషారభరిత సమీరాన్ని ఆస్వాదించి బ్రతుకు జీవులమనిపిస్తున్నాయి నిట్టూర్పు విడుస్తూ. ఇంకా ఎండా-వెలుతురు స్పష్టంగానే ఉన్నాయి.

ఏమిటో ఏదో యోచిస్తూనే ఏటి గట్టునే, ఏకాంతాన్ని తలపోసుకుంటూ ఎంతదూరమో నడచాను వెనక్కి తిరిగి చూడకుండానే. పోతే నిర్ణీతగమ్యం చేరుకున్నా అన్యమనస్కుడనై కూడా అలవాటు ప్రకారం ఆ ప్రదేశానికే చేరదీసింది నా శరీరం-భౌతిక కాయం.

కన్నులపండుగ్గా ఉన్న ఉద్యానవనం - నిర్మలంగా ఉంది. శాంత సుందరపూరిత మందిరంలా నాకెందుకో "సత్యం, శివం, సుందరం" అనే ఉపనిషద్భావన ఆ కుసుమవదనాల్లో గోచరమైంది. రకరకాల కుసుమాలు ఎక్కువగా రంగురంగుల శోభతో ఓ కాంతిమయ కిరణపుంజంతో ప్రకాశిస్తున్నాయి. రెండురకాలు—సుగంధాలు నిర్గంధాలు—అక్కడక్కడా కన్నులపండువుగా గోచరించాయి. సుధాకరుడిలో మచ్చలెందుకు? తామర తూడుకు నాచుదేనికి? ఆ నిర్గంధ కుసుమాలు కూడా అందాన్ని కల్పిస్తున్నా ఉద్యానవనానికి-పాపం, సుగంధ భరితం కాదని సిగ్గుపడి దురపిల్లే వాటి ముఖాలు, కందిపోయి ఆ అరుణ కాంతిలో రక్తసిక్తమైనట్టుంది. జాలి కలిగింది. ఆ నిర్గంధ పుష్పాల వదనాన్ని వీక్షించగానే...

ఒక సుగంధాన్ని స్వీకరించాలని కోర్కె కలిగింది. అదిగో అదే పువ్వు నన్నెప్పటినుండో ఆకర్షిస్తోంది. నే నేమైనా ఆకర్షింపగలిగానో లేదో? చివాలున గులాబీకొమ్మ వంచాను. అంతలో నాకేదో బాధాతప్తదీనధ్వని వినిపించింది-ఆగాను. నేను తుంచబోయిన పుష్పం... మాట్లాడుతోంది. ఆశ్చర్యంతో విస్మయుడనై నిశ్చేష్టతతో వింటున్నా. జాలిగా వినపడింది:

"ఏమయ్యా! ఓ నవయువకుడా, నన్ను..." అని ఏమేమో చెప్పబోయింది. అంతలోనే, నే నడ్డువచ్చి,

"ఇక ఆగవచ్చు. "కరుణశ్రీ"వారి పుష్పవిలాపాన్ని నాముందు వినిపింప దలచుకున్నావేమో చాలించు. నా సౌఖ్యంకొరకు ప్రకృతిని యథేచ్ఛగా వినియోగించుకుంటాను. మానవుడే ప్రకృతి కధినేత. ఆకర్షించిన ప్రతి ప్రకృతిజీవాణువును ఆస్వాదించే హక్కు నాకుంది" అన్నాడు, ఆ పువ్వుమాటలు పెడచెవిని పెట్టి.

"అది కాదయ్యా! నవవిలాసీ! నేను 'కరుణశ్రీ' వారి పుష్పాన్ని కాదు. మరో విషయం: నా స్థితిని తెలుసుకున్నావా నే నింకా కొద్దిక్షణాల్లో, నా తల్లి పాదపద్మ ధూళిలో మిళితమైపోతాను. నాకీ జగత్తులో స్థానం స్వల్పం. నా జీవితవ్యవధి కొద్ది క్షణాలు. నన్ను పరిగ్రహించి నీవేమి ఆనందాన్ని ఆస్వాదించుకోగలవు చెప్పు."

"నాకవన్నీ అనవసరం. నీలోని మార్దవం, వాడిపోయిన నీరెక్కల మెత్తదనం, వయసుమళ్ళిన నీ మూర్తిలోని మాతృహృదయం నన్నాకర్షించాయి."

"ఓయీ! అది చాలా ప్రకృతి విరుద్ధం-యువకుడెవడూ తన భవిష్యదానందంకోసం నవ

వికసిత పుష్పాన్నే వరిస్తాడు. అప్పుడే ఎక్కువ కాలం ఆ పుష్పంలో మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించగలడు. నన్ను పరిగ్రహిస్తానంటున్నావు నాకే నవ్వొస్తుంది. ఒకపక్క బాధగా కూడా వుంది. నన్ను హేళనచేస్తున్నట్లుగా ఉన్నాయి నీమాటలు-నీకోర్కె."

"నీ అంత తాత్త్వికబోధన నాకవసరం నేను వినలేను. అసలు పాటించ నవసరం కూడా లేదనుకుంటాను. బహుశా నేను నీ దృష్టిలో, ప్రకృతి విరుద్ధంగా కనపడవచ్చు. ముడుచుకుపోయిన మొగ్గల్ని చూస్తే నాకు పరమ అసహ్యం, రోత. ఇక నవవికసిత పుష్పాలన్నా వే-అందరూ స్వీకరించేవి-వీటిలో ఉండే అహంకారం, యౌవన రసపిపాసా, వీటికుండే ద్విగుణీకృత గర్వం అందరినీ ఆకర్షించగలనునే వాటిధీమా మనస్తత్వం వాటి ఊర్ధ్వ దృష్టి-వాటిని చూచి అవే మురిసిపోతూంటాయి. పాపం వాటిని నేను భరించలేను; పైగా మీబోటివాండ్లలో ఉండే దీనార్ద్రహృదయ ప్రతిధ్వనులవల్లనే నెందుకో, తంబుర గానంలో మత్తెక్కిన ప్రకృతిలా వాపోతాను-మైమరుస్తాను - మీలో ఉండే జాలి, మాతృస్వభావం, తరతరాల అనుభవయుతమైన కర్కశత్వాన్ని విడనాడిన మీబోటి వాటి మెత్తని హృదయాలే నాకు ధ్యేయం. యౌవనాన్ని నేను కాంక్షించను. అందులో హాయి పూర్తిగా ఘాతికాధారం-హృదయ సౌందర్యం శాశ్వతం. మీబోటి పుష్పాలిచ్చే కొద్దిక్షణాల ఆనందమైనా నాకు ఆనందపు లోతులు చూపిస్తుంది. మీ అశ్రుపూరిత నయనాల్లోని జాలిచూపులు నన్ను గాయపరచి ఆకర్షించాయి. ఇక, మరి మిమ్మల్ని పరిగ్రహించడాని కనుమతిస్తారా" అంటూ జవాబుకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాను. సమాధానం లేదు-చకితుడనయాను.

అంతలో నెమ్మదిగా, ఇలా అంది పువ్వు—

"నీవేదో భావనా లోకంలో ఆదర్శాలనే విహంగంపై, విహరిస్తున్నావు. నీమాటలు వింటుంటే నాకెంతో జాలిగావుంది. నాకుకూడ ఒక యువకుడి జీవితానందసాగరంలో భాగస్వామిని కాగల సమర్థతుందా? అని విస్తుపోతున్నాను. నన్ను స్వీకరిస్తే నీ బంధుమిత్రుల్లో అపహాస్యాల పాలవుతావు" అంటూనే అశ్రుపూరితమయింది పుష్పవదనం-గొంతుకకూడా డగ్గుత్తికయింది. చెప్పలేకపోతూంది. కొద్దిసేపట్లో తెప్పరిల్లి నెమ్మదిగా "నాకు కావలసినదదే- ఒక్కక్షణమైనా మానవుని జీవితసౌఖ్యానికి దోహదమివ్వగలిగితే- అదే నా పరమ, చరమ లక్ష్యం, గమ్యం. నా ధర్మం. అయితే అలాంటి దోహదమివ్వగల క్షణాలు, అవకాశాలు పూర్తిగా గడిచిపోయాయి. యౌవనంలో నన్నెవరూ పరిగ్రహించలేకపోయారు. అంతా పూర్తికావచ్చే తరుణంలో మానసిక వేదన కలిగించావ్. నీవా యువకుడివి, నీకెంతో భవిష్యత్తుంది- ఆనందాన్ననుభవింపవలసిన కాలం, అలవిమాలినంత మిగిలి ఉంది. ఆ కాలాన్నంతా నేనైతే పూర్తిగా వినియోగపరచలేను - మరొక నవవికసిత కోమలపుష్పాన్ని పరిగ్రహించి నీ భవిష్యత్ జీవితాన్ని సుగమ్యం చేసుకో. ఇందులో నా స్వార్థం ఉందనుకుంటున్నావేమో - నీ హాయే నా పరమధర్మం. నీవా నవవికసిత సుమాన్ని గ్రహించినట్లయితే, నేనిపుడే, నీముందే ఆనందబాష్పాలతో మిమ్మల్ని ఆశీర్వదించి మా తల్లి ప్రేళ్ళపై చల్లగా కళ్లుమూస్తాను. శాంతియుతంగా నా జీవితాన్ని చాలిస్తాను-నన్ను స్వీకరించి నీవుపొందే ఆనందం వలన నాకువచ్చే సుఖంకంటే - నీవా నవవికసిత పుష్పాన్ని పొంది, నీ విశేష భవిష్యత్తు ఆనందంతో నడిపితే నాకొచ్చేసౌఖ్యం గొప్పది. దాన్నే నేను కాంక్షిస్తాను. ఇదే నాచివరికోర్కె-ఇక నీ ఇష్టం" అని ముగించిందా పుష్పం-వాడిన కుసుమం.

నాకేమీ తోచలేదు-బాధ కల్గింది. నే నింకెవరినీ స్వీకరించలేను. ఆ పుష్పం నన్ను గ్రహించవద్దంటుంది. ఆ కుసుమం వింతమనస్తత్వానికి విస్తుపోయాను. నాలోనేను నవ్వుకున్నాను మళ్ళీ ఆ పుష్పానికి దుఃఖం కల్గించడం మనస్కరించలేదు-నిరాశాదృక్కులతో సాంధ్యచంద్రికలోకి చూచాను - అరుణుడస్తమిస్తున్నాడు. వెలుగు పోతోంది - చీకటి నెమ్మదిగా ఆవరిస్తోంది లోకమంతా తనదిగా చేసుకుంటున్నట్లు-బరువుగా మెల్లిగా ఆలోచిస్తూనే వొంటరిగా, చీకటిలోనే ఇంటికి చేరుకున్నాను శూన్యహృదయంతో. ★